సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

అమ్మకు పౌష్టికాహారం

- గర్భిణులు, బాలింతలకు ఇంటికే డ్రై రేషన్
- వైఎస్సార్ పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులు, బాలింతలకు అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో సరకులు

పెదగంట్యాడ: గర్భిణి ఆరోగ్యంగా ఉంటే బిడ్డలు చక్కని ఆరోగ్యంతో పుడతారు. బాలింతలు బలమైన ఆహారం తీసుకుంటే పిల్లల ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. అందుకే మాతా శిశు సంరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది ప్రభుత్వం. ఆరోగ్యవంతమైన భావితరాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నారు. గర్భిణులు, బాలింతల పోషణను దృష్టిలో పెట్టుకుని, వారి ఇళ్లకే పోషకాహార కిట్లు అందజేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రక్తహీనతను నివారించేలా..
పేదరికం కారణంగా సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో గర్భిణుల్లో రక్తహీనత సమస్య ఎదురవుతుంది. వారికి పుట్టిన బిడ్డలకూ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అదనపు పౌష్టికాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులకు గతంలో ఇచ్చే బియ్యం, పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరో ఆరు రకాల పోషక పదార్థాలను అందించడంతో వారిలో రక్తహీనత తగ్గుతుంది. ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వగలరు.

ఆ కష్టాలకు చెక్
గర్భిణులు, బాలింతలకు గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం తయారు చేసి పెట్టేవారు. దీంతో వారు ప్రతి రోజూ మధ్యాహ్నం ఎండలో కేంద్రానికి వెళ్లి భోజనం చేయడానికి ఇబ్బంది పడేవారు. అది కూడా సమయానికి వెళ్లలేకపోయారు. దీంతో కొందరు పాలు, గుడ్లు మాత్రమే తీసుకెళ్లేవారు. ఒక్కోసారి బాక్సుల్లో అన్నం తీసుకెళ్లేవారు. అది కూడా బాలింతలు, గర్భిణుల ఇళ్ల నుంచి ఎవరో ఒకరు వచ్చి తీసుకెళ్లేవారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం వారికి అనుకూలంగా ఉండేలా నిర్ణయం తీసుకుంది. రోజూ కేంద్రాలకు రాకపోయినా వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకానికి (టేక్ హోం రేషన్ కిట్) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. వారి ఇళ్ల వద్దకే సరకుల కిట్లు అందిస్తున్నారు. దీంతో కాబోయే తల్లికి అవసరమైన పోషక విలువలున్న ఆహారం.. బాలింతలకు పౌష్టికాహారం అందుతోంది. నెలకు ఒకేసారి డ్రై రేషన్ కిట్లు అందజేయడంతో వారి ఇబ్బందులు తొలగాయి. సంపూర్ణ పోషక విలువలున్న ఆహారాన్ని వారికి నచ్చిన విధంగా తీసుకుంటున్నారు. ఆరోగ్యంగా ఉంటున్నారు.

కిట్‌లో సరకులివీ..
వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలో ఒక్కో కిట్టుకు రూ.850 ఖర్చు చేస్తున్నారు. అందులో మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటర్ ఆయిల్, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు ఉన్నాయి. అయితే ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం 50శాతం నిధులు ఇస్తుండగా మరో 50శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరుశనగ చిక్కీ, 250 గ్రాముల ఖర్జూరం, 250 గ్రాముల బెల్లం అందిస్తోంది. దీనిపై అంతటా ఆనందం వ్యక్తమవుతోంది. గర్భిణులు, బాలింతలు తమ ఇంటికే సరుకులు ఇవ్వడంతో సంతోషంగా ఉన్నారు.

బిడ్డకు సమృద్ధిగా పోషకాలు



టేక్ హోం రేషన్ కిట్‌లో రాగి పిండి, చిక్కీ, ఖర్జురం, బెల్లం వంటి సరకులుంటున్నాయి. దీంతో నా బిడ్డకు సంపూర్ణ పోషక విలువలున్న ఆహారం అందుతోంది. బాబు ఆరోగ్యంగా ఉంటున్నాడు. బాలింతలు, వారి పిల్లల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
-బి.భారతి, బాలింత, ప్రియదర్శిని కాలనీ

నాణ్యమైన సరకులు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలో నాణ్యమైన సరకులు ఇస్తున్నారు. ఈ సామాన్లను మార్కెట్లో కొనాలంటే చాలా ఖర్చవుతుంది. ప్రతి రోజూ నేను ఈ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నాను. నాకు పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా పుడతారని ధైర్యంగా ఉంది.
- డి.తేజ, గర్భిణి, వికాస్‌నగర్

ఇబ్బందులు తొలగాయి



గతంలో భోజనానికి రావడానికి బాలింతలు, గర్భిణులు అవస్థలు పడేవారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లలేక ఇంట్లోనే ఉండేవారు. కేవలం గుడ్లు, పాలు మాత్రమే తీసుకెళ్లేవారు. ఈ కిట్లను అందించడం ద్వారా వారి ఇబ్బందులు తొలగాయి. సంతోషంగా తింటున్నారు.
- ఎ.లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఇస్లాంపేట సెక్టార్

క్లుప్తంగా

26న రక్తదాన శిబిరం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: క్రాంతి మెమోరియల్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన పెదగంట్యాడలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు 69వ వార్డు దాసకి క్రాంతి రెడ్డి యూత్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను తుంగ్లాంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు గొందేశి సాయి, గిడితూరి అప్పారావు, చుక్కా గోపి, బాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు 13వ ధ్యాన వసంతోత్సవం

పెదగంట్యాడ: పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం 13వ ధ్యాన వసంతోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివగణేశ్వరరావు తెలిపారు. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు రామాలయం పక్కన గల జీవీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యూపోర్టు సీఐ రాము, ఎస్‌ఐ మన్మథరావు, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి హాజరవుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా సామూహిక ధ్యానం, శివ కల్చరల్ డ్యాన్స్ అకాడమీ వారి నృత్యోత్సవం, సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27లోగా iti. ap. gov. in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ దరఖాస్తు కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 28న ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలిపారు. ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 30న ఉదయం 9.30 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

అంకుర సంస్థలకు ఆ హబ్ ఆర్థిక సహకారం

ఏయూక్యాంపస్: యువత స్థాపించి, నిర్వహిస్తున్న అంకుర సంస్థలు (స్టార్టప్)లకు ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఏయూ ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు ఒక ప్రకటనలో తెలిపారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం ఏర్పాటు చేసిన నిధి పథకంలో భాగంగా యువత ఆలోచనలు ఆవిష్కరణలుగా, ఉత్పత్తులుగా మార్చడానికి అవసరమైన మూలధనం పెట్టుబడిని అందిస్తామని పేర్కొన్నారు. పథకంలో భాగంగా కనిష్ఠంగా రూ.2 లక్షలు, గరిష్ఠంగా రూ.10 లక్షలు అందిస్తామని తెలిపారు. టెక్నాలజీ, సైన్స్ ఆధారంగా పని చేసే అంకుర సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ఫొటోటైప్ ఉత్పత్తిని 12 నెలల్లో తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి ఐవోటీ అనుసంధానం తప్పనిసరి అన్నారు. పూర్తి వివరాలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఆ హబ్‌లో నెలకొల్పిన ఏయూ నిధి ఐటీబీఐ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

చెస్ బాక్సింగ్ పోటీల విజేతలకు అభినందన

పరవాడ: చెస్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ జాతీయ చెస్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో 12 మంది పతకాలు సాధించారు.ఈ సందర్భంగా సత్తా చాటిన విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. క్రిష్ దెవని ,ప్రియాంష్ సింగ్,ఎస్. హరిన్ ,ఐ.కౌశిక్ , కె అభిరామ్ ,ఎల్. సాకేత్ ,బి. తేజశ్రీ , ఎ.నవ్యశ్రీ ,ఎం.హాసిని , జి.హర్షిత , ఎ.హర్షిత, వి.వైష్ణవిలను అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు చింతా ప్రతాప్ అభినందించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

పారదర్శకంగా పథకాల అమలు


మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు భరత్‌నగర్ సచివాలయ పరిధి కూర్మన్నపాలెం రామాలయం వీధిలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులను కలిశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని, తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వి.వి.ఎస్.ఎన్.రాజు, వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, మాటూరి శ్రీనివాసరావు, చేగొండి శ్రీనివాసరావు, వాడపల్లి రామచంద్రరాజు, శ్రీనివాస్ పట్నాయక్, చిట్టి దేముడు, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, పోలీస్ శాఖ, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

టోల్ ప్లాజా తక్షణం తొలగించాలి


అగనంపూడి టోల్‌గేటు వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నేతలు

వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

అగనంపూడి: దశాబ్దాలుగా దారిదోపిడీకి పాల్పడుతున్న అగనంపూడి టోల్‌ప్లాజాను తక్షణం తొలగించాలని సీపీఎం నాయకుడు, కార్పొరేటర్ బి.గంగారామ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అగనంపూడిలో కొనసాగిస్తున్న టోల్‌గేటును తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో టోల్‌గేటు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యయానికి మించి ఆదాయం వసూలు చేసినా కేంద్ర ప్రభుత్వ పెద్దలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కాంట్రాక్టర్లను పెంచడం కోసం, కమిషన్ల కోసం అగనంపూడి టోల్‌గేటును బంగారు గుడ్లు పెట్టే బాతులా వాడుకుంటున్నారని ఆరోపించారు. దీని వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోందన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్టీల్‌సిటీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నెల్లి శ్రీనివాసరావు, కేశవరపు వాసు, బలిరెడ్డి సత్యనారాయణ, వామపక్షాల నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్.రామారావు, జి.బోసుబాబు, రెహమాన్, సత్యాంజనేయులు, ఆనంద్, రాజబాబు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు. సౌత్ జోన్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో దువ్వాడ, స్టీల్‌ప్లాంట్, గాజువాక, మల్కాపురం పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొని వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

మంత్రి అమర్‌నాథ్ దృష్టికి చేనేత కార్మికుల సమస్యలు


చేనేత కార్మికుల సమస్యలను మంత్రి అమర్‌నాథ్‌కు వివరిస్తున్న రాజారావు

అక్కిరెడ్డిపాలెం: చేనేత కార్మికుల సమస్యలను ఏపీ వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, చేనేత, జౌళి శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. 68వ వార్డు మిందిలోని మంత్రి నివాసంలో సోమవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చేనేతల సమస్యలపై ఇచ్చిన వినతిపత్రాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి అమర్‌నాథ్ సానుకూలంగా స్పందించి, సంబంధిత ఫైళ్లను పరిశీలించి త్వరలో చేనేతల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 27న గాజువాకలో నిర్వహించనున్న చేనేతల సభకు తప్పకుండా హాజరు కావాలని వారు మంత్రిని ఆహ్వానించారు. త్వరలో విజయవాడ వేదికగా చేనేతల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్, ఏపీ వీవర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, విశాఖపట్నం చేనేత విభాగం అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ తదితరులున్నారు.

24న మెగా జాబ్ మేళా

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 24వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు గొన్నా విద్యా సంస్థల కార్యదర్శి గొన్నా హేమచంద్ నాయుడు తెలిపారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపకుడు, దివంగత జీబీ నాయుడు 48వ జయంతిని పురస్కరించుకుని ఈ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. హనీ గ్రూప్, డెక్కన్ కెమికల్స్, అపోలో ఫార్మా, జియో ఫైబర్, యోకోహామా, ఎస్ఐబిటీ, ఐసీఐసీఐ, జయభేరి ఆటోమోటివ్స్, వరుణ్ బజాజ్, పవర్ రివ్యూస్, ఎస్ఆర్ కంట్రోల్, ఆటోమిషన్స్, టాటా స్ట్రయివ్, టీజే ఇండియా లిమిటెడ్, ముథూట్ ఫైనాన్స్ కంపెనీల్లో పోస్టుల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ పోస్టులకు ఎంటెక్, బీటెక్, ఎంబీఏ, పీజీ, ఫార్మసీ, డిప్లమో, ఇంటర్, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 96428 29352, 98857 84543 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి

మేయర్ హరి వెంకటకుమారి


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకుంటున్న మేయర్


తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్ : కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తన సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బంది వినియోగించేలా చూడాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలన్నారు.

శ్రీనివాసుడికి తులసీదళార్చన

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి సోమవారం తులసీ దళాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు.

కల్యాణం .. కమనీయం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పోర్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి


నిరవధిక దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పైడిరాజు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని విశాఖ జిల్లా సీపీఐ కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్ష శిబిరాన్ని సీపీఐ నాయకులతో కలసి సోమవారం సందర్శించారు. నిర్వాసిత కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. జీతాలు పెంచమని కోరిన కార్మికులను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ, క్షేత్రపాల్, రెహమాన్, నందన్న తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికుల పోరాట శక్తికి ఎదురు లేదని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 921వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తానని ప్రకటించడం ప్రభుత్వ నిరంకుశత్వ పాలనకు నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా చేయాలని దేశ ప్రజలు, కార్మికవర్గం, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రకటనలతో కార్మికులు బెదిరేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ప్రతిపాదనను వెనక్కి తీసుకుని ప్రైవేటీకరణ అంశాన్ని ఆపాలని, లేనిపక్షంలో కార్మికులంతా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్



కార్యక్రమంలో విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

డాబాగార్డెన్స్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు సోమవారం స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి నిర్వహించారు. కళాశాల ఆవరణ, మౌలిక సదుపాయాలు, సంస్కృతిని ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఈ కార్యక్రమం సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి సహాయం చేస్తుందని ప్రిన్సిపాల్ వివరించారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా అధ్యాపకుల ద్వారా ఫ్రెషర్స్‌కు స్వాగతం పలకడం, విద్యార్థినులకు సంబంధిత సిబ్బందితో పరిచయ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంస్థ దృక్పథం, సంస్థాగత విధానాలు, విలువలతో కూడిన విద్య గురించి తెలిపారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ నేతృత్వంలో ఎన్ఈపీ, సీబీసీఎస్ నిర్మాణం, సింగిల్ మేజర్ సిస్టమ్‌లోని పాఠ్యాంశాలు, మూల్యాంకన విధానాల గురించి వివరించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి సంతోషి అనూష విద్యార్థులకు ప్రవర్తనా నియమావళి గురించి తెలపగా, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి, లైబ్రేరియన్ డాక్టర్ ఎ. ధరణి కళాశాల ఆవరణలో గల వివిధ విభాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమం 21 రోజుల పాటు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు రేపు


ప్రతిభా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 23న అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ద్వితీయ భాషా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే ఉద్దేశంతో రెండేళ్లుగా ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలోని అనేక డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, కథలు తదితర విభాగాల్లో తెలుగు, హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందిస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్, కోటేశ్వరరావు, గౌరీనాయుడు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తెలుగు భాషా వారోత్సవాలు

ఏయూ క్యాంపస్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు తెలిపారు. ఆగస్టు 29న కళాప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం నుంచి 29 వరకు రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

దీనిలో భాగంగా నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వివిధ మేధోపోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23న వ్యాసరచన పోటీలు, 24న వక్తృత్వ పోటీలు, 25న పద్యపఠనం, 26న తెలుగు భాషా సాహిత్యాలపై క్విజ్, 27న నిష్ణాతులైన భాషా సాహిత్యవేత్తలతో చర్చా గోష్ఠి, 28న సోమవారం గిడుగు రామమూర్తి రచనలపై ఉపన్యాసాలు, 29న ముగింపు కార్యక్రమం ఉంటాయని తెలియజేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విశిష్ట అతిథులుగా ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్ బాబు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ డి.వి సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి హాజరవుతారని వివరించారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్ : ప్రముఖ చలన చిత్ర కథానాయకులు చిరంజీవి, బాలకృష్ణ నటించిన పలు చిత్రాల గీతాలతో సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. స్వర గీతిక సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళారంగ ప్రముఖులు భయ్యా శ్రీనివాస్, సన్‌మూర్తి, సంస్థ వ్యవస్థాపకుడు రాజారావు, శ్యాంసుందర్ ప్రారంభించారు. లోకేష్ ట్రాక్స్ సహకారం అందివ్వగా, లక్ష్మీ స్వరూప వ్యాఖ్యానం చేశారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు మహదేవ మూర్తి, బొమ్మిడి సత్యనారాయణ, కేఎల్ రావు, వేణుగోపాల్, వీవీఎస్ మూర్తి, జిలాని, శ్యాంసుందర్, రామ్ కుమార్, మాధవ్, వెంకటేష్, అభినయ్, మాధురి, లక్ష్మీ సాత్విక, గౌరీ, సుజాత, లాయర్ శ్రీదేవి, లక్ష్మీ స్వరూప తదితరులు గీతాలాపన చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com